క్లుప్తంగా

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన


లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: రాబోయే ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కలెక్టర్ నిషాంత్ కుమార్ స్థానిక ఉద్యాన కళాశాలను సోమవారం పరిశీలించారు. అందుబాటులో ఉన్న గదులు, లెక్కింపు కేంద్రం ఏర్పాటుకు అనుకూలంగా ఉండే గదులు, పార్కింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం


చినభోగిలిలో కాలువల్లో తీస్తున్న పూడికలు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు, ఓవర్‌హెడ్‌ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ పనులు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని వెంకటాపురం ఓవర్ హెడ్‌ట్యాంక్ శుద్ధి, లచ్చయ్యపేట, జోగింపేట, చినభోగిలి గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సమీపిస్తున్నందున గ్రామ సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుద్దీకరణ పనులు తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే ట్యాంక్‌లను శుద్ధి చేయడం, క్లోరినేషన్, పారిశుధ్యపనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆయుష్మాన్ భారత్ పరిశీలన


ఆయుష్మాన్‌భారత్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద పీవీటీజీలను నమోదు చేయాలని, ఈకేవైసీ చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ ఆదేశించారు. పార్వతీపురం మండలంలోని బందిదొరవలస గ్రామంలో ఆయుష్మాన్‌భారత్ ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీటీజీల నమోదు, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సంబంధిత యాప్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఆయుష్మాన్ భారత్ యాప్‌లో నమోదైన వారికి ఆయుష్మాన్ భారత్ కార్డు వస్తుందని ఆయనన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జావేద్, పంచాయతీ సెక్రటరీ సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

ఆటగాళ్లకు బనియన్లు, టోపీల పంపిణీ


కార్యదర్శులకు పంపిణీ చేసిన ఎంపీడీఓ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడాకారులకు బనియన్లు, టోపీలను పంపిణీ చేసేందుకు అవసరమైన కిట్లను ఎంపీడీఓ విజయలక్ష్మి జెడ్పీటీసీ ఎ.రవికుమార్ కార్యదర్శులకు సోమవారం అందజేశారు. మండల స్థాయిలో పాల్గొనే ఆటగాళ్లకు గుర్తింపుగా ఒక సచివాలయం పరిధిలో 114మందికి వీటిని పంపిణీ చేయనున్నారు. మండలస్థాయిలో ఆడేందుకు వచ్చే క్రీడాకారులు వీటిని వేసుకుని క్రీడలకు రావాల్సి ఉంటుందని ఎంపీడీఓ విజయలక్ష్మి ఈ సందర్భంగా కార్యదర్శులకు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు. అలాగే అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజామద్దతు


వైఎస్సార్‌సీపీలోకి ప్రతిపక్ష నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- వైఎస్సార్‌సీపీలో చేసిన పార్వతీపురం 29వ వార్డు ప్రజలు

పార్వతీపురంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం హయాంలో పార్వతీపురం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధే మళ్లీ వచ్చే ఎన్నికల్లో ఆయన ముఖ్యమంత్రిగా గెలిచేందుకు దోహదపడుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం 29వ వార్డులో సోమవారం పెద్దఎత్తున ప్రతిపక్ష పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు తెలియచేసిన విధానమే అందుకు నిదర్శనమన్నారు. వార్డులో నిర్వహించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం పాల్గొని వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలు, మంచి నీటి కుళాయిలను వార్డు ప్రజల సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ వార్డులో జరుగుతున్న అభివృద్ధికి మెచ్చి ప్రతిపక్ష పార్టీల నుంచి పలువురు నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో స్వచ్ఛందంగా పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ నాడు ఇచ్చిన మాట ప్రకారం ఎన్నో అభివృద్ధి పనులను పూర్తి చేయడమే కాకుండా ప్రజల ప్రతి సమస్యనూ స్థానిక కౌన్సిలర్ ద్వారా తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇంకా అక్కడక్కడ ఏమైనా సమస్యలు ఉంటే వాటిని కూడా వచ్చే ఎన్నికలలోగా పూర్తి చేసిన తరువాతనే మిమ్మల్ని ఓటు అడగనున్నట్లు చెప్పారు. మీరంతా ఇదే ప్రేమ, ఆప్యాయతలతో వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వార్డు కౌన్సిలర్‌లు యడ్ల త్రినాథ, అర్.చిన్నంనాయుడు, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు, సచివాలయం కన్వీనర్లు బత్తుల శ్రీదేవి, బత్తుల శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన అనిల్‌కుమార్

వైఎస్సార్‌సీపీలో చేరిన అనిల్‌కుమార్

పార్వతీపురం పురపాలక సంఘంలోని 22 వార్డుకు చెందిన సుంకరి అనిల్ కుమార్ సోమవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలోకి ఆయనను సాదరంగా ఆహ్వానించి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే జోగారావు భరోసా ఇచ్చారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 22వ వార్డులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన అనిల్ కుమార్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన దక్షతకు, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న తీరుకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీని అన్ని విధాలా బలోపేతం చేసేందుకు స్థానిక నాయకత్వంతో కలిసి పనిచేస్తానని తెలియజేశారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి


మక్కువ: లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్న దొర

- డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలోని పెంట్రిడ్డి యాదవవీధి, బీసీ వీధులలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ఆయా వీధులలో పర్యటించగా, మహిళలు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు తెలుసుకుని వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న హయాంలో విద్య, వైద్యం కోసం లక్షలాది కోట్ల రూపాయలను వెచ్చించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్ మావుడి రంగునాయుడు, ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

బలిజిపేట: మండలంలోని వివిధ పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు చేశారు. పాఠశాలలకు మంగళవారం నుంచి సంక్రాంతి సెలవులు ఇస్తున్నందున ముందుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఈఓ-1 సామల సింహాచలం తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ పద్ధతులను తెలుసుకునేందుకు, వాటిని భవిష్యత్‌లో కొనసాగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు సంప్రదాయ పద్ధతుల్లో పాఠశాలలకు హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సంతోషించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పలగర ప్రాథమిక పాఠశాల వద్ద సంక్రాంతి సంబరాలు జరుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వికసిత్ భారత్ సభలతో సంక్షేమపథకాలపై అవగాహన

సీతానగరం: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వికసిత్ భారత్ గ్రామసభల ద్వారా ప్రజలకు వివరిస్తున్నట్లు ఈఓ పీఆర్డీ కె.కుమారవర్మ, అరకు పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ నాయకుడు హేమనాయక్ అన్నారు. ఈ మేరకు సోమవారం వికసిత్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ రెడ్డి సింహాచలం ఆధ్వర్యంలో చెల్లన్నాయుడు వలస, కృష్ణారాయపురం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఉచితవంటగ్యాస్ పంపిణీ, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, గ్రామీణాభివృద్ధికి అవసరమైన పథకాలను వివరించారు. గ్రామసభలు నిర్వహించే ప్రాంగణంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఉచితవైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఉచితవైద్యశిబిరాలను, వంటగ్యాస్ కనెక్షన్లను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.


గ్రామసభలో పాల్గొన్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, బీజేపీ నాయకుడు హేమనాయక్

ఇచ్చిన మాట ప్రకారం రూ. 3వేల పింఛన్

- జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు

సాలూరు: ఇచ్చిన మాట ప్రకారం 3 వేల రూపాయల పింఛన్ ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని జేసీఎస్ కన్వీనర్, 22వ వార్డు కౌన్సిలర్ గిరి రఘు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే అధిక మొత్తంలో పింఛన్ ఇస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని 20,21,22 వార్డుల్లో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మంచి చేస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. గత టీడీపీ హయాంలో పింఛన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హత ఉంటే చాలు పథకాలు ఇంటి వద్దనే అందుకోవచ్చని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పిరిడి రామకృష్ణ, వాసు, గిరి చిన్నిదొర, సుధ, తదితరులు పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

విద్యార్థులకు సికిల్‌సెల్ పరీక్షలు

బలిజిపేట: పౌష్టికాహారం, రక్తం తక్కువ (సికిల్‌సెల్)ఉన్న వ్యాధికి సంబంధించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బలిజిపేట మండలంలోని మిర్తివలస డీపీఈపీ ప్రాథమిక పాఠశాలలో సచివాలయ ఏఎన్‌ఎం రమణమ్మ విద్యార్థులకు సోమవారం రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను వైద్యశాఖకు పంపించనున్నట్లు ఆమె తెలిపారు. భవిష్యత్తులో రక్తం తక్కువగా ఉండే విద్యార్థులకు అవసరమైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మిర్తివలస డీపీఈపీ పాఠశాలలో పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం రమణమ్మ

ఈవీఎంలపై సంపూర్ణ అవగాహన కల్పించాలి


చిలకలపల్లి ఉన్నత పాఠశాల వద్ద అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక బృందం

బలిజిపేట: 2024లో జరగబోయే ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలపై ఓటర్లకు పూర్తిస్థాయి అవగాహన అవసరమని ఆర్డీఓ కార్యాలయం అధికార బృందం అన్నారు. ఈ మేరకు చిలకలపల్లి ఉన్నత పాఠశాల వద్ద పలువురు ఓటర్లకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఓటర్లకు ఈవీఎంలపై ఉండే అవగాహనా రాహిత్యాన్ని తొలగించాలని, ప్రతి ఓటరుకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

దార్శనికుడు అంబేడ్కర్


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: బడుగుల ఆశాల జ్యోతి.. దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని బుక్కూరు సర్పంచ్ టి.సుందరమ్మ అన్నారు. ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో భాగంగా ఆ మహనీయుడిని స్మరించుకుంటున్నట్లు చెప్పారు. బలహీన వర్గాలకు సమాజంలో గుర్తింపు తెచ్చింది అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలను సీఎం జగన్‌మోహనరెడ్డి అమలు చేస్తున్న తీరు హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిన్నింటి లక్ష్మి, ఉప సర్పంచ్ వి.కొండలరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భోగి లత

వీరఘట్టం: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న వీరఘట్టంకు చెందిన భోగి లత పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషా ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల కాపీని విజయవాడ కార్యాలయంలో భోగి లతకు సోమవారం అందజేశారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనకు మరోసారి అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా జన్‌భాగీ దారి

బలిజిపేట:

సీఎం జగన్మోహన్ రెడ్డి చేతులమీదుగా ఈనెల 19వ తేదీన విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరగనున్న సందర్భంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో జన్‌భాగీధారి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఎంఈఓ-1సామల సింహాచలం, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సామల సింహాచలం మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని తెలిపారు. ఆయన ఆశయసాధనకు అందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. అటువంటి మహానాయకుడి విగ్రహాన్ని సీఎం జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించి రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

విజ్ఞానాన్ని పెంపొందించడానికి వ్యాసరచన పోటీలు

సీతానగరం: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి, మానసిక ఉల్లాసా న్ని కల్గించడానికి వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు దోహద పడతాయని ఎంఈఓ-1 జి.సూరిదేముడు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో జన్‌భాగీదారి ప్రొగ్రాం 1అమలులో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ పోటీల్లో గాదెల వలస విద్యార్థి శ్రీచరణ్, సీతానగరం విద్యార్థి హేమంత్‌కుమార్, మరిపివలస విద్యార్థిని ఎస్.కావ్య, వ్యాసరచన పోటీల్లో గాదెలవలసకు చెందిన బి.దినేష్, సీతానగరం ఉన్నత పాఠశాలకు చెందిన డి.శ్రావణి, మరిపివలసకు చెందిన సీహెచ్ స్వప్న, వక్తృత్వం పోటీల్లో గాదెలవలస ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్ రోహిణి, సీతానగరం ఉన్నత పాఠశాలకు చెందిన బి.లీలాప్రసన్న విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలిసి ఎంఈఓ సూరిదేముడు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 ఎంవీ రమణ, విద్యావనరుల కేంద్రం సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.


పోటీల్లో విజేతలతో ఎంఈఓ జి.సూరిదేముడు

గ్రామాల్లో వైఎస్‌ఆర్ పింఛన్ కానుకల పంపిణీ

సీతానగరం: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీ మేరకు జగనన్న ప్రభుత్వం పింఛన్ రూ.3 వేలకు పెంచిన సందర్భంగా వైఎస్ఆర్ పింఛన్ కానుకలను గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో వలంటీర్లు లబ్ధిదారుల ఇంటిముంగిటకే వెళ్లి సోమవారం పంపిణీ చేశారు.ఈ మేరకు రూ.3 వేలు పింఛన్ వృద్ధులు, వితంతువులకు పంపిణీ చేస్తుండడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా చినభోగిలిలో సర్పంచ్ కె.రాధ, కన్వీనర్ రాము, నిడగల్లులో సచివాలయ కన్వీనర్ జి.శ్రీనివాసరావు, తిరుపతినాయుడులు పింఛన్లు పంపిణీ చేశారు. నెలకు రూ.3 వేల పింఛన్ పంపిణీ చేయడంతో జగనన్నకు రుణపడి ఉంటామని 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నకు ఓట్లు వేసి రుణం తీర్చుకుంటామని లబ్ధిదారులు అంటున్నారు. కార్యక్రమంలోనిడగల్లు సర్పంచ్ ఆరుద్రమ్మ, కార్యదర్శి పెంటతిరుపతిరావు, చినభోగిలి కార్యదర్శి మనోహర్, గ్రామ వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


నిడగల్లులో వైఎస్సార్ పింఛన్ కానుకలు పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరావు

వ్యాధుల నియంత్రణకు ప్రణాళికలు సిద్ధం చేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

- జిల్లా మలేరియా ఆధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: కీటక జనిత వ్యాధుల నియంత్రణకు కచ్చితమైన ముందస్తు ప్రణాళికను ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు జిల్లాకు చెందిన సబ్‌యూనిట్ అధికారులతో సోమవారం ఆయన మలేరియా కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంవత్సరం ప్రారంభం నుంచి ప్రతి నెలా నిర్వహించాల్సిన, నిర్వర్తించిన కార్యచరణకు సంబంధించి ప్రణాళికలు, నివేదికలను విధిగా కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు. మలేరియా, డెంగీ గుర్తిస్తే ఆ ప్రాంతంలో చేపట్టిన నియంత్రణ చర్యలు వాటికి సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. దోమల పిచికారీ చేపట్టిన ప్రదేశాలు, పిచికారీ మందు నిల్వల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని కోరారు. ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం కచ్చితంగా అమలు చేసి దోమల ఆవాసాలను నియంత్రించాలన్నారు. సంబంధిత యాప్‌లో డ్రైడే వివరాలు వెంటనే నమోదు చేసేలా పర్యవేక్షించాలని, వసతిగృహాలను ఎప్పటికప్పుడు సందర్శించి అక్కడ కిటికీలకు మెస్‌ల అమరిక స్థితి, సిక్ రూంలో దోమలు రాకుండా ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారో పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి నెలా ఆరోగ్య కేంద్రంలో, క్షేత్రస్థాయిలో నిర్వహించిన జ్వర నిర్ధారణ పరీక్షల నివేదికను, రికార్డులను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. గిరిజన, మారుమూల గ్రామాలపై ఎక్కువగా దృష్టిసారించి పక్కా ప్రణాళికతో జిల్లాలో జ్వరాల నియంత్రణకు సిబ్బంది కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, జిల్లా మలేరియా కన్సల్టెంట్‌లు రామచంద్రుడు, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.